క్లుప్తంగా

25 నుంచి గడపగడపకు కాంగ్రెస్

ఇల్లెందు: ఈ నెల 25 నుంచి కాంగ్రెస్ గడపగడపకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పులి సైదులు, ఆరెం కిరణ్, వల్లాల రాజయ్య, గడదాసు వెంకటేశ్వర్లు, సూర్నపాక సత్యనారాయణ, ముక్తి కృష్ణ, తాటి భిక్షం పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యం కల్పించండి

కొత్తగూడెంఅర్బన్: రానున్న ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని నిర్భయ ఫౌండేషన్ అధ్యక్షురాలు, అడ్వకేట్ మల్లెల ఉషారాణి కోరారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు. 2024 ఎన్నికల లోపు బిల్లు అమలులోకి తీసుకరావాలని కోరారు. బిల్లు అమలైనా కాకున్నా అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని విన్నవించారు. సమావేశంలో వాసర్ల నాగమణి, వీణ, నల్లపు శిరీష, రాగిణి, రమ్య పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై సమీక్ష

కొత్తగూడెంరూరల్: జిల్లాలో కుష్టు నిర్మూలనపై, ఆగస్టులో జరిగిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై రాష్ట్ర అదనపు డైరెక్టర్ ఆఫ్ లెప్రసీ తెలంగాణ డాక్టర్ రవిందర్‌నాయక్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష చేశారు. కార్యక్రమంలో 9,35,476 మందిని కలిశారని, వీరిలో 2,574 మందిని అనుమానితులుగా గుర్తించారని డీఎంహెచ్‌ఓ శిరీష తెలిపారు. వీరికి పూర్తి పరీక్షలు చేయగా 16 మందికి రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించినట్లు చెప్పారు. ఇంకా 740 మందిని పరీక్షలు చేయాల్సి ఉందని, ఈనెల చివరి కల్లా పూర్తిస్థాయిలో స్క్రీనింగ్ పూర్తి చేయాలని, జిల్లాలోని డిప్యూటీ పారామెడికల్ అధికారులకు డీఎంహెచ్‌ఓ శిరీష ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కుష్టు రోగులు తీసుకుంటున్న వివరాలు సేకరించాలన్నారు.

పోడు పట్టాలివ్వండి

పాల్వంచరూరల్: ఏళ్ల తరబడి స్థానికంగా నివాసం ఉంటున్న వలస ఆదివాసీ గిరిజన రైతులకు పోడు పట్టాలివ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దంతలబోరు గ్రామపంచాయతీలోని సీతారాంపురం గ్రామంలో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. 20 సంవత్సరాలుగా వలస వచ్చి సీతారంపురం గ్రామంలో నివాసం ఉంటున్న ఆదివాసీ గిరిజనుకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడం వలన వారి పిల్లలు కూడా చదువుకోలేక కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యం కల్పించి కుల ధ్రువీకరణ పత్రాలు, పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల స్వచ్ఛత ప్రతిజ్ఞ

కొత్తగూడెంఅర్బన్: కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి పాతకొత్తగూడెం తెలంగాణ స్కూల్ విద్యార్థులతో కలిసి చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చెత్తబండికి ఇవ్వడం చేయాలన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధించడం ప్రతిజ్ఞ ముఖ్యఉద్దేశ్యమని వివరించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె ప్రారంభం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారం కోరుతూ మిడ్ డే మీల్స్ కార్మికులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో సమ్మె చేపట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. అవునూరి మధు, జారె ఆదినారాయణ, బత్తుల అంజి శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఇల్లెందురూరల్: మాణిక్యారం గ్రామపంచాయతీ పరిధిలో 30 కుటుంబాలు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దిండిగల రాజేందర్, జనగం కోటేశ్వరరావు, దాస్యం ప్రమోద్‌కుమార్, లష్కర్, శీలం రమేష్, రేణుక, ఘాజీ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్‌లో సిబ్బందిని తీసుకోవద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్ సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ హైస్కిల్డ్ సిబ్బందిని తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెంరాజుకు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. అనేకమంది అనుభవజ్ఞులు ఉన్న సంస్థలో ఈవిధంగా తీసుకోవడం సరైందికాదన్నారు. ఎండీ రజాక్, కూసన వీరభద్రం, చిలక రాజయ్య, చెరిపల్లి నాగరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె బాట

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పోరాటం
- కేంద్రాలు తెరుచుకోక లబ్ధిదారుల ఇక్కట్లు


మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సుజాతనగర్: శిశు, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె బాట పట్టారు. వీరి నిరవధిక సమ్మెతో మండలంలోని 50 కేంద్రాల్లో సేవలు నిలిచిపోయాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందాల్సిన పౌష్టికాహార పంపిణీ ఆగిపోయింది. డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు భీష్మించుకున్నారు.

కనీస వేతనం అందించాలి...

కొత్తగూడెం అర్బన్ ప్రాజెక్టు పరిధిలో సుజాతనగర్, చుంచుపల్లి, కొత్తగూడెం మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 182 మెయిన్, 34 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రాజెక్టు పరిధిలో 171 మంది మెయిన్ టీచర్లు, 27 మంది మినీ టీచర్లు, 158 మంది హెల్పర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల పరిధిలో టీహెచ్‌ఆర్ పిల్లలు 3,831 మంది, ప్రీస్కూల్ పిల్లలు 1,902 మంది, 950 మంది గర్భిణులు, 827 మంది బాలింతలు ఉన్నారు. మెయిన్ టీచర్లకు ప్రభుత్వం రూ.13,650, మినీ టీచర్లు, హెల్పర్లకు రూ.7800 చొప్పున ప్రతి నెలా వేతనంగా చెల్లిస్తోంది. కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆలనాపాలనాతో పాటు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం వండిపెడుతూ బీఎల్‌ఓలుగా కూడా అంగన్‌వాడీ టీచర్లు చలామణి అవుతున్నారు. అయితే పెరిగిన ఖర్చుల దృష్ట్యా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 11 నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు.

ఒత్తిడితోనే ప్రజాసేవ...

ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సేవలకు సంబంధించిన 14 రకాల రిజిస్టర్లను వీరు రాయాల్సి ఉంటుంది. ఎస్‌హెచ్‌టీఎస్, పోషణ ట్రాకర్, ఈసీసీఈ అనే యాప్‌లలో కూడా వీరు ఆయా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటోంది. ఈ సేవలతో పాటు వీరు అదనంగా బీఎల్‌ఓల విధులను సైతం నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు తదితర సేవలను అందిస్తున్నారు. బీఎల్‌ఓల విధుల విషయంలో ఒక్కోసారి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలలో జరిగే సమావేశాలకు సైతం వీరు హాజరు కావాల్సి ఉంటుంది. ఇంతలా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం తమకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్, మినీ అంటూ తమపై వివక్ష చూపుతున్నారని మినీ టీచర్లు ఆవేదన చెందుతున్నారు.

కేంద్రాలను స్వాధీనం చేసినా...

ఈ నెల 11 నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఆయా కేంద్రాల పరిధిలో పౌష్టికాహారం అందడం లేదు. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ పౌష్టికాహారంతో కూడిన భోజనం, ఉడకబెట్టిన గుడ్డు పెడతారు. 12 రోజులుగా నిరవధిక సమ్మె నేపథ్యంలో కేంద్రాలన్నీ మూసివేసే ఉంటున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాల తాళాలను క్షేత్రస్థాయికి సిబ్బందికి అందజేశారు. అనంతరం వారు గుడ్లు, ఇతర సరుకులను లబ్ధిదారులకు అందజేశారు. అయితే ప్రతిరోజూ కేంద్రాలు తెరుచుకోకపోవడంతో ప్రీస్కూల్ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇళ్లకే పరిమితమయ్యారు.


మూతపడిన సుజాతనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎన్నో ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న మాకు ఉద్యోగ భద్రత లేదు. ఏళ్లుగా కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం ఆలోచించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– కళావతి, అంగన్‌వాడీ టీచర్, సుజాతనగర్

సరైన గుర్తింపు లేదు



ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు సరైన గుర్తింపు లేదు. అంగన్‌వాడీ విధులతో పాటు, ఓటర్ల చేర్పులు, మార్పులు తదితర పనులు కూడా చేస్తున్నాం. మాకు న్యాయం చేయాలి.

– ముక్తి నాగమణి, కొత్త అంజనాపురం

సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లతో సమ్మె చేస్తుంటే భయభ్రాంతులకు గురిచేయడం తగదు.

– వీర్ల రమేష్, సీఐటీయూ నాయకుడు

పోస్టల్ సేవలపై అవగాహన

ఇల్లెందురూరల్: పోస్టల్ విభాగం ద్వారా అందుతున్న సేవలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోస్టల్ శాఖ సబ్‌డివిజన్ అధికారి వశిష్ట, మెయిల్ ఓవర్సీస్ నర్సింహారావు అన్నారు. కొమరారం ఉన్నత పాఠశాలలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోస్టాఫీస్ ద్వారా ఎస్‌బీ, ఆర్డీ, సుకన్య సమృద్ధి, మహిళా సమ్మాన్, ఇన్సూరెన్స్ తదితర పథకాలతోపాటు ఐపీపీబీ అకౌంట్, గ్రూప్ ఇన్సూరెన్స్‌లపై అవగాహన కల్పించారు. బ్యాంకుల కంటే పోస్టాఫీసు ఎక్కువ వడ్డీ రేట్లు, బోనస్ చెల్లిస్తుందని చెప్పారు. పోస్టాఫీసు సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లింగానాయక్, స్థానిక పోస్టు మాస్టర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం


కొత్తగూడెంరూరల్: పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సోనా


పాల్వంచరూరల్: బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శ్రీరామ్మూర్తి

కొత్తగూడెంరూరల్: శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీ మైదానంలో లక్ష్మీదేవిపల్లి మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మండల క్రీడా ఎంపిక పోటీలను ఎంపీపీ భూక్యా సోనా శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్, ప్రిన్సిపాల్ హవీలా, పిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, పీఈటీలు సుజాత, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడాపోటీలు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు ఎంఈఓ శ్రీరామ్మూర్తి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంట్ క్రీడలు ప్రారంభం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో 2023–24 క్రీడలను సీఈఆర్ క్లబ్ జేకే కాలనీలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య శుక్రవారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. సింగరేణి ఆధ్వర్యంలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులతో ఉద్యోగులకు కోచింగ్ ఇచ్చి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు స్నేహభావంతో క్రీడలలో పాల్గొనాలన్నారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉద్యోగులు తమ తమ విధులు నిర్వహిస్తూనే క్రీడాపోటీలపై ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఈ క్రీడలలో డీవైపీఎం పి.కృష్ణ, స్పోర్ట్స్ సెక్రెటరీ సాయి స్వరూప్, ఎస్.రంగనాథ్, సారయ్య పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' సమస్యలపై స్పందించాలి


ఇల్లెందు: మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు ఆరోపించారు. శుక్రవారం ఇల్లెందు తహసీల్ ఎదుట కొనసాగుతున్న అంగన్‌వాడీ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. దేవరకొండ శంకర్, అబ్దుల్ నబీ, వెంకటమ్మ, మమత, నాగలక్ష్మి, కారం పద్మ, అంజలి పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని గద్దె దించాలి: గుమ్మడి నర్సయ్య

చిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సమ్మెకు మద్దతు తెలిపారు. యాకుబ్‌షావలీ, బుర్ర వెంకన్న, బోసు, సావిత్రి, ఆవుల కిరణ్ పాల్గొన్నారు.

టేకులపల్లి: అంగన్‌వాడీలను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లతో సీఐయూటీ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 12వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత ఆవునూరి మధు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు వేర్వేరుగా అంగన్‌వాడీల సమ్మె శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం అంగన్‌వాడీలు సామూహిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ దీక్షలను ప్రారంభించారు.

నేడు 'ఈటల' పర్యటన

చుంచుపల్లి: బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వాహణ కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ శనివారం జిల్లాలో పలు పార్టీ సమావేశాల్లో పాల్గొంటారు. తొలుత భద్రాచలంలో నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశంలో, అనంతరం కొత్తగూడెంలో పార్టీ నాయకుల సమావేశంతో పాటు విలేకరులతో మాట్లాడనున్నట్లు శుక్రవారం పార్టీ వర్గాలు తెలిపాయి.

సమ్మె నోటీసు అందజేసిన ఆశా కార్యకర్తలు

సుజాతనగర్: ఆశా వర్కర్ల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు వైద్యాధికారికి శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సీఐటీయూ నాయకుడు వీర్ల రమేష్ మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన ఆశా కార్యకర్తలను చిన్నచూపు చూడటం తగదన్నారు. జయమ్మ, గరికె వసంత, వరలక్ష్మి పాల్గొన్నారు.

జీఓ142 రద్దు చేయండి

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి ఇబ్బందిగా మారిన జీఓ 142 రద్దు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 25న జిల్లా వైద్యఆరోగ్య జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు శుక్రవారం జేఏసీ నాయకులు డీఎంహెచ్‌ఓ శిరీషకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ పిలుపు ఉద్యోగులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

జూలూరుపాడు: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు చెంగల గురునాథం, మందా ప్రభాకర్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ జూలూరుపాడులో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. గార్లపాటి కృష్ణ, సురేష్, శివకృష్ణ, కల్యాణ్, దామెర్ల శ్రీకాంత్, సుధాకర్, మందా బాబు, పోతురాజు నాగరాజు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

పాల్వంచరూరల్: ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొత్తూరులో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్రీ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలను వాడుకోవాలని చెప్పారు. కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

పాల్వంచరూరల్: మండల పరిధి బస్వతారక కాలనీ పంచాయతీలోని సోములగూడెం రోడ్డులో అటవీశాఖ రూ.1.44 కోట్ల వ్యయంతో నిర్మించిన నందన వనం పార్క్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పార్క్‌లో అటవీశాఖ అధికారులతో కలిసి కలియతిరిగారు. మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో కొత్తగూడెం నియోజకవర్గాన్ని సుమారు రూ.3వేల కోట్ల వ్యయంతో మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కేసీఆర్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించి మరోసారి సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో అటవీశాఖ సీసీఎఫ్ బి.భీమానాయక్, డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓ వి.తిరుమలరావు, వనమా రాఘవేందర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఎంపీటీసీ మోహన్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, సర్పంచ్‌లు కాశమ్మ, అమర్‌సింగ్, సక్కుబాయి, పెద్దమ్మగుడి డైరెక్టర్ ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, మల్లెల శ్రీరామ్మూర్తి, కాల్వప్రకాశ్‌రావు, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా

మహిళాభివృద్ధికి సంక్షేమ పథకాలు

నారీశక్తిగా ఎదగడానికి సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం రూ.10లక్షల వ్యయం కలిగిన రైతులకు అద్దెకు ఇచ్చే వ్యవసాయ పరికరాల కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం


రాంపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అండదండలతో పని చేస్తున్నానని, గ్రామాల్లో ఎక్కడ చూసినా సీసీ, బీటీ రోడ్లే కనిపిస్తున్నాయని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. శుక్రవారం రోళ్లపాడు, గోలియా తండా, తడికలపూడి, తావుర్యా తండా, రాంపురం, ప్రెగళ్లపాడు, టేకులపల్లి, దాసుతండా గ్రామ పంచాయతీల్లో రూ.3 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాధ, వరప్రసాద్, బాలు, దళపతి శ్రీనివాస్‌రాజు, లక్కినేని శ్యామ్, రామ, కిషన్, మౌలానా, బసవయ్య, చీమల సత్యనారాయణ, శివకృష్ణ, మురళి, నరేష్, ఏఈలు నవీన్, రా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేత

చుంచుపల్లి: పంచాయతీ రాజ్ శాఖ సాంకేతిక వ్యవస్థలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు తమ సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌లను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కిషోర్, క్రాంతి, చంద్రకళ, కిరణ్, అనీషా, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ ప్రియాంకకు సమ్మె నోటీసు అందజేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

అన్నదాతలు ...

ఇల్లెందు: మండలంలోని రొంపేడులో రెవెన్యూ విలేజ్ పరిధిలోని సర్వే నంబర్ 549 భూమికి సంబంధించి రెవెన్యూ సమగ్ర సర్వే నిర్వహించాలని సీఎస్‌పీ బస్తీ రైతులు కలెక్టర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా సీఎస్‌పీ సర్పంచ్ భూక్యా రవిబాబు ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే హరిప్రియను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు.

శిక్షణ పొందిన మహిళలకు రాత పరీక్ష


హాజరైన అధికారులు, మహిళలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర వృత్తి విద్య శిక్షణ పూర్తి చేసిన మహిళలకు శుక్రవారం రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్, కిష్టారం సేవా సెంటర్‌లో రాతపరీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు ఎం.మధురవాణి షాలెంరాజు, పర్సనల్ మేనేజర్ బి.శివకేశవరావు పాల్గొన్నారు. అధ్యక్షురాలు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ అందిస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణను పొందిన మహిళలు వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా ఉండాలని ఆకాంక్షించారు. నిరుద్యోగాన్ని తగ్గించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. స్వయం ఉపాధి పొందడంతోపాటు తమద్వారా మరికొంత మందికి జీవనోపాధి కల్పించే విధంగా కృషి చేయాలని సూచించారు. శిక్షణ పొందిన 178 మంది మహిళలలో 150 మంది హాజరయ్యారు.

మహిళా బిల్లు ఆమోదంపై హర్షం

చుంచుపల్లి: చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా కిరణ్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో భారీగా మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహిళలు మోదీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పాతబస్ డిపో నుంచి బస్టాండ్ వద్ద అమరవీరుల స్తూపం వద్దకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రంగాకిరణ్ మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళా సాధికారతకై మరో ముందడుగు పడిందని ఇది చారిత్రాత్మకమన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మహిళా బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మోక్షం కలిగించిందని దీంతో యావత్ భారతదేశంలో చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం పెరిగి, మహిళల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆకుల నాగేశ్వరరావు గౌడ్, చింతలచెరువు శ్రీనివాస్‌రావు, సాయిరాం, జల్లారపు శ్రీనివాస్, కటికల రంజిత్ పాల్గొన్నారు.


కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

జూలూరుపాడు: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ అన్నారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమ్మినేని వీణ, నర్వనేని శిరీష, సిరిపురపు సత్యావతి, నాగమణి, సావిత్రి, స్వరూపరాణి, ఆశాకుమారి, పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాళ్లయ్యా.. దండాలయ్యా..

నవరాత్రి గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మండపాల వద్ద శుక్రవారం కుంకుమ, సరస్వతి పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజలో పాల్గొన్నారు. వినాయకుడికి ఉండ్రాళ్లు, కుడుములు, పాయసం, గారెలు, పండ్లు నైవేద్యంగా సమర్పించారు. పలుచోట్ల కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: నంబర్ 2 బస్తీలో లక్ష్మీగణపతికి రూ.5 లక్షల కరెన్సీతో అలంకరణ


పాల్వంచ: వర్తక సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపూజలో పాల్గొన్న మహిళలు


ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో..

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148